క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండల పరిధిలోని జుజాల్ పూర్‌కు చెందిన జగతి దుర్గయ్య ఇటీవల మరణించగా ఆయన సతీమణి జగతి శంకరమ్మకు రైతుబీమా ద్వారా రూ.5 లక్షలు మంజూరైన చెక్కును క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. నాగల్‌గిద్ద మండలంలోని ఎర్రబొగుడకు చెందిన బన్సీలాల్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.20వేల చెక్కు, కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరు అయిన ఆర్థిక సహాయం చెక్కులను నర్సమ్మకు పంపిణీ చేశారు. డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ జైపాల్ రెడ్డి, సిర్గాపూర్ మండల అధ్యక్షులు సంజీవ్ రావు, నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షులు మల్లొండ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగానియోజకవర్గ అభివృద్ధికి ఎంపీని నిధులను మంజూరు చేయాలని కోరగా నిధులను మంజూరు చేసేందుకు ఎంపీ సానుకూలత వ్యక్తం చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

కనీస వేతనాలు అందించాలి



మాట్లాడుతున్న రాజయ్య

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో సీఐటీయూ కార్మికుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఆయా పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



భక్తులతో నీలం మధు

జిన్నారం(పటాన్‌చెరు): ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మండల పరిధిలోని అండూర్ గ్రామంలో ముత్యాలమ్మ, నల్లపోచమ్మ జాతరలో మంగళవారం నీలం మధు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించే జాతరలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. దేవాలయాల గ్రామాల్లో ఎలాంటి ఉత్సవాలు నిర్వహించినా తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.

17న స్పాట్ అడ్మిషన్‌లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తెలంగాణ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఖాళీల కోసం ఈ నెల 17వ తేదీన స్పాట్ అడ్మిషన్‌లను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ రాంప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియ ప్రారంభించే ముందు గ్రూపుల వారీగా ఖాళీలను ప్రకటిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 17వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్‌లు, సర్టిఫికెట్‌ల కాపీలను తీసుకు రావాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరయ్యే విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ కోసం మాత్రమే పరిగణించబడతారని తెలిపారు.

నేడు దత్తగిరి వైదిక పాఠశాలలో ప్రవేశాలు



అర్చకత్వం నేర్చుకుంటున్న విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలో ఉన్న దత్తగిరి మహారాజ్ వైదిక పాఠశాలలో నేడు ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి, వైదిక పాఠశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిద్దేశ్వరస్వామి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల విద్యార్థులు అర్చకత్వం నేర్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం ఆశ్రమ ఆవరణలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మంగళవారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు భారీ సంఖ్యలో మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు హాజరయ్యారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో సీఎం కేసీఆర్ విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు పారిశ్రామిక రంగంలోనూ పూర్తిస్థాయిలో ప్రోత్సాహకాలు అందిస్తున్నారని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టి పేదింటి బిడ్డలకు అండగా నిలుస్తున్నారని వివరించారు. చిట్కుల్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్య ప్రదర్శనను మెచ్చి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వారికి రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, నియోజవర్గంలోని ఆయా మండలాల ఎంపీపీలు దేవానందం, సుష్మాశ్రీ వేణుగోపాల్‌రెడ్డి, సద్ది ప్రవీణవిజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజా వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు రోజాబాల్‌రెడ్డి, లలితాసోమిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం’



మాట్లాడుతున్న సంగప్ప

జహీరాబాద్ టౌన్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప అన్నారు. పట్టణంలోని పద్మశాలి భవనంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ సంయుక్త మోర్చ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగప్ప మాట్లాడుతూ ప్రధానమంత్రి అమలు చేస్తున్న కార్యక్రమాలను చూసి ప్రపంచ దేశాలు మనదేశం వైపు చూస్తున్నాయన్నారు. రోడ్లు, రైల్వేల, విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, కుటుంబ పాలనలో కూరుకపోయిందన్నారు. ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలు చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దళితబంధు పథకం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదన్నారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లు, మూడెకరాల భూమి పథకాలు నీరుగారాయని తెలిపారు. ప్రతిఒక్కరూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రవికుమార్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, నాయకులు సుధీర్ కుమార్, రాంచందర్ రాజనర్సింహ, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారీ, పూల సంతోష్, ఏకనాథ్ పాటిల్, ఆశోక్ బెల్కేరీ, నరేష్ పాటిల్ పాల్గొన్నారు.

‘లక్ష’కు తిప్పలు



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారులు

వట్‌పల్లి(అందోల్): బీసీ కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో మీ–సేవా కేంద్రాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20 చివరి తేదీ కావడంతో బీసీలంతా ఒక్కసారిగా కుల, ఆదాయ పత్రాల కోసం మంగళవారం తహసీల్దారు కార్యాలయానికి తరలివచ్చారు. సర్వర్‌డౌన్ కావడంతో ధృవపత్రాల జారీలో అంతరాయం ఏర్పడడంతో దరఖాస్తుదారులు ఆందోళనకు గురవుతూ సాయంత్రం వరకు కార్యాలయం వద్దనే పడిగాపులు కాశారు.

పరామర్శ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం పర్యటించారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌కు చెందిన పెంటయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో శ్రీనివాస్‌గౌడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. తడ్కల్‌కు చెందిన హుల్‌గొండ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించారు.



సన్మానం పొందిన మహిళలతో ఎమ్మెల్యే మాణిక్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాణిక్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో మహిళల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నారన్నారని తెలిపారు. బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు పింఛన్లు, పేదింటి ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, ఆరోగ్య మహిళ, పోలీసుశాఖలో 33 శాతం రిజర్వేషన్ తదితర సౌకర్యాలను కల్పించారని వివరించారు. అంతేకాకుండా మార్కెట్ కమిటీల్లో సైతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా ఉద్యోగులకు గౌరవ వేతనం పెంచినట్టు తెలిపారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఓ జయదేవ్, ఆర్డీఓ వెంకారెడ్డి, తహశీల్దార్ స్వామి, మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి, ఎంపీడీఓ సుమతి, బీఆర్‌ఎస్ నాయకులు మచ్చేందర్, సురేష్, అంజమ్మ, మణెమ్మ, అరుణజ్యోతి, మంజుల, రమాదేవి, మంజుల కౌశాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

జహీరాబాద్‌లో ఆరెకటిక సంఘం భవన నిర్మాణానికి స్థలం, రూ.10లక్షల నిధులు మంజూరు చేసినందుకు గాను సంఘం నాయకులు ఎమ్మెల్యే మాణిక్‌రావును మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, ఆరెకటిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కొండాపూర్(సంగారెడ్డి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయని డీఈఓ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 608 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలు ఉదయం 9:30 నిమిషాల నుంచి 12:30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొనానరు. 5 నిమిషాల నిబంధన అమల్లో ఉందని తెలిపారు.

సమన్వయంతోనే మండల అభివృద్ధి

ఎంపీపీ సరళ



మాట్లాడుతున్న ఎంపీపీ సరళ

కంది(సంగారెడ్డి): అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సరళాపుల్లారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన కంది మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సరళాపుల్లారెడ్డి మాట్లాడుతూ విడుతల వారీగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల వివరాలను సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియజేయాలని సూచించారు. ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు వరకుమార్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రి శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగేండ్ల నుంచి 16 సమావేశాలు నిర్వహించినా సభ్యుల సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. అధికారుల పనితీరు సరిగా లేదన్నారు. సభ్యుల అడిగిన ప్రశ్నలను మినిట్స్ బుక్‌లో ఎందుకు నమోదు చేయడంలేదని ప్రశ్నించారు. ఇంతలోనే సమావేశం ముగిసిందని ఎంపీపీ ప్రకటించారు. సమావేశంలో జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవి, ఎంఈఓ వెంకట్ నర్సింలు, పీఆర్ఏఈ మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీలు హంసా హనుమంత్ నాయక్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే మహిళలకు రక్షణ



సన్మానం పొందిన మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్ హయాంలోనే మహిళలకు రక్షణ ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం అందోల్ నియోజకవర్గ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని చౌటకుర్ మండలంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ మంజుశ్రీ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పటిష్టంగా తయారైందన్నారు. పటిష్టమైన పోలీసు వ్యవస్థతో ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించారన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, ఎంపీడీఓలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంఆర్‌ఓలు, ప్రజాప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సెర్ప్ ఉద్యోగులు, పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ అధికారి శివకుమార్



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శివకుమార్

మునిపల్లి(అందోల్): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ అన్నారు. మంగళవారం ఎంపీపీ శైలజా శివశంకర్, జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ హరినంధరావు అధ్యక్షతన నిర్వహించారు. రైతుబంధు మంజూరు కోసం లబ్ధిదారులకు కొత్తగా భూములను రిజిస్టేషన్ చేసుకున్న రైతులు కొత్త పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫోన్ నంబర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు జిరాక్స్ కాపీలను అందజేయాలన్నారు. రేషన్ కార్డు మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐ రవీందర్‌రావు అన్నారు. రెండు సంవత్సరాలుగా రేషన్ కార్డు మంజూరుకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేటికీ ప్రభుత్వం మంజూరు చేయలేదని పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని, అప్పటివరకు మనం దరఖాస్తు చేసుకుంటే ఒకేసారి లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని ఆర్ఐ రవీందర్ సభ దృష్టికి తెచ్చారు. సంక్షేమ పథకాలకు అర్హులను అధికారులు గుర్తించి పూర్తి వివరాలను జిల్లా అధికారులకు పంపిస్తే ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఎంపీపీ శైలజా, జడ్పీటీసీ మీనాక్షి అన్నారు. 9,929 మిషన్ భగీరథ ద్వారా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ నల్లాకనేక్షన్ ఇచ్చినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగధ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాబాపటేల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట (అందోల్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు బ్యాగులను అందజేసేందుకు ముందుకు వచ్చిన ఎన్‌ఆర్ఐ కుటుంబాన్ని ఎమ్మెల్యే అభినందించారు. నియోజకవర్గ కేంద్రంలో పీఆర్‌టీయూ భవనానికి అవసరమైన స్థలాన్ని ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం బ్యాగులను పంపిణీ చేసిన ఎడ్యుకేట్ అండ్ ఎన్‌రిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులైన డాక్టర్ రమేష్, సువాచల, ప్రతీక్‌లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ జైపాల్‌రెడ్డి, ఎంఈఓ బండి కృష్ణ, టీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు ప్రభు, కోఆర్డినేటర్ మధుసూదన్, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు నరోత్తం, రాజమల్లు, జిల్లా పీఆర్‌టీయూ నాయకులు మహేష్‌చారి, మంజ్యానాయక్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ భవనం ప్రారంభం

జోగిపేటలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన వీరహనుమాన్ దేవాలయ కమిటీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున రూ.10లక్షలను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లికార్జున్, మున్సిపల్ వైస్‌చైర్మన్ డేవిడ్, ఎంపీపీ మాజీ అధ్యక్షుడు రామాగౌడ్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జూకంటి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు గాజుల నవీన్, తుపాకుల సునిల్‌కుమార్, పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జోగిపేటకు చెందిన పట్నం రత్నమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష విలువ చేసే ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్రాంతికిరణ్ రత్నమ్మ కుమారుడు పట్నం మురళికి అందజేశారు. ఎల్‌ఓసీని ఇప్పించినందుకు ఎమ్మెల్యేకు రత్నమ్మ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, అందోలు–జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు చాపల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన సిరిమణి గణేష్ కుటుంబానికి అండగా ఉంటామని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని అండూర్ గ్రామానికి చెందిన గణేష్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన శ్రీనివాస్‌గౌడ్ మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, సోలక్‌పల్లి సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, రాజ్‌గోపాల్‌రెడ్డి, యాదవ్, రవిగౌడ్, దుర్గేష్ పాల్గొన్నారు.

◆ గడ్డం సాయిలుకు నివాళి

నారాయణఖేడ్: మండల పరిధిలోని అనంతసాగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం సాయిలు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంగళవారం మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షులు సురేశ్ షెట్కార్, ఉమ్మడి మెదక్ జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి సాయిలు మృతదేహానికి నివాళులు అర్పించారు.

◆ విరాళం


సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని దుర్గాభవాని దేవాలయానికి ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం మంగళవారం రూ.2లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

◆ కేన్సర్ బాధితుడికి చేయూత



కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కార్మాగారంలో పనిచేస్తున్న పాండు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. దీంతో చికిత్స నిమిత్తం డబ్బులు లేకపోవడంతో స్పందించిన తోటి ఉద్యోగులు కలిసి రూ. 4,66,316 అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లా డుతూ కాన్సర్‌తో బాధపడుతున్న తనకు చికిత్స కోసం ఆర్థికసాయం చేసిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గోదావరి అంజిరెడ్డి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా గోదావరి అంజిరెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్, జిల్లా అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ ఆలయ కమిటీ ఎన్నిక

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా విరూపాక్ష, అధ్యక్షుడిగా బెజగం శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా కొండ మనోహర్, ప్రధాన కార్యదర్శిగా చివర రమేష్, అదనపు కార్యదర్శి కంకర్ శ్రీనివాస్, కోశాధికారి పవన్ కుమార్, ముఖ్య సలహాదారుడు వరప్రసాద్, సంయుక్త కార్యదర్శి సింగర్‌గౌడ్, రామనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శి చెవ్వ వెంకటేష్, మూర్తి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

◆ వరదాచార్యులకు సన్మానం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో ప్రధాన అర్చకులు వరదాచార్యులను మంగళవారం శ్రీమన్నారాయణ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఘనంగా సన్మానించారు. రెండు రోజుల క్రితం ముంబైలో ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, ట్రస్ట్ సభ్యులు వరదాచార్యులను సన్మానించారు.

◆ ఘనంగా జయదుర్గాదేవి వార్షికోత్సవం

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని జయ దుర్గాదేవి నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం ప్రత్యేక పూజలు చేసి రూ.2 లక్షల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు రూ.51,000 విరాళాన్ని అందజేశారు. వీరిని దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

◆ దరఖాస్తుల గడువు పొడిగింపు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల కోసం ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కన్వీనర రాజేశ్వరరావు తెలిపారు. ఎస్ఎస్‌సీ పాస్ అయిన విద్యార్థిని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ht-tr://iti.telangana.gov.in వెబ్సైట్ ద్వారా సంప్రదించాలన్నారు.